# ప్రజా మారిటిలి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 175 పేజీలు : 04 వెల రూ. 2 శుక్రవారం 26 - 12 - 2025





దేశవ్యాప్తంగా డెలివరీ వర్కర్ల సమ్మె..

## రేవంత్‌రెడ్డి కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోడు



- ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, అదేందని అడిగిన వారిపై ఎదురుదాడికి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు.
- సమైక్యాంధ్రలో మాదిరిగానే దోపిడీ మొదలైందని మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి విమర్శించారు.

తెలంగాణ రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొందని, కృష్ణ గోదావరి నీళ్లు దోపిడికి గురవుతూ హక్కులకు భంగం వాటిల్లోతోందని, సమైక్యాంధ్రలో మాదిరిగానే దోపిడీ మొదలైందని మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, అదేందని అడిగిన వారిపై ఎదురుదాడికి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుభవం లేదని కేసీఆర్ ఏదైనా చెబితే పాజిటివ్‌గా - మిగతా 2 లో

### వాజ్‌పేయి ప్రసంగాలు, వ్యక్తిత్వం

## యువతకు మార్గదర్శకాలు

- ఒక్క ఓటు తేడా ఉంటే నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేసి ప్రధాని పదవిని తృణ ప్రాయంగా వదులుకున్న మహోన్నతమైన నేత అటల్ జీ అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
- భారతదేశ రక్షణ కోసం ఎంతో కృషి చేసి సుపరిపాలన అందించిన నేత అని తెలిపారు.
- సర్వ శిక్ష అభియాన్ పేరుతో విద్యాలయాల్లో మౌళిక వసతులు అటల్ బిహారీ వాజ్‌పేయి ఏర్పాటు చేశారని చెప్పారు



అటల్ జీ 101వ జన్మదినం సందర్భంగా దేశమంతా ఉత్సవాలు కార్యక్రమాలు జరుపుకుంటున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని , భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు కేంద్రమంత్రి. అనంతరం మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి మంచి వక్త, మంచి పరిపాలనా దక్షుడు, విలువలు కలిగిన మహా నేత అని కొనియాడారు. ఒక్క ఓటు తేడా ఉంటే నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేసి ప్రధాని పదవిని తృణ ప్రాయంగా వదులుకున్న మహోన్నతమైన నేత అటల్ జీ అని అన్నారు. భారతదేశ రక్షణ కోసం ఎంతో కృషి చేసి సుపరిపాలన అందించిన నేత అని తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ పేరుతో విద్యాలయాల్లో మౌళిక వసతులు ఏర్పాటు చేశారని చెప్పారు.. పేద ప్రజల పక్షాన నిలిచి వారి అభ్యుదయం కోసం అనేక సంస్కరణలు తీసుకోచ్చిన నేత అటల్ అని అన్నారు. ఆయన ప్రసంగాలు, వ్యక్తిత్వం దేశ యువతకు మార్గదర్శిగా నిలిచాయన్నారు. పాకిస్థాన్ వెన్నుపోటు పొడిస్తే తిరిగి పాక్‌కు మూడు చెరువుల నీళ్ళు తాగించి పాక్‌ను మట్టికరిపించిన ఘనత అటల్‌కు దక్కుతుందని చెప్పుకొచ్చారు. ఒక దేశం నుండి మరొక దేశానికి.. ఢిల్లీ నుంచి లాహోర్‌కు బస్‌లో వెళ్లిన మొదటి ప్రధాని మోదీ అని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి పేరుతో దేశ వ్యాప్తంగా రోడ్ల విస్తరణ చేసిన ఘనత ఆయనది అని అన్నారు. దేశ ప్రగతిలో తనదైన ముద్ర వేసుకున్న మహానుభావుడన్నారు. - మిగతా 2 లో

### జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో

## కేసీఆర్ చెప్పాలి



- కేసీఆర్ కుటుంబం తెలంగాణకు శని
- కాళేశ్వరం స్కామ్ నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల గురించి మాట్లాడుతున్నారన్న సంజయ్
- ముడుపుల కోసం తెలంగాణను తాకట్టు పెట్టారని మండిపాటు
- రేవంత్ భాష ఆయన్నే నష్టపరుస్తుందని వ్యాఖ్య

కృష్ణా నదీ జలాల అంశంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కాం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ ఇప్పుడు కృష్ణా జలాల విషయాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని స్పష్టంగా చెప్పారు.కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు జరిగిన నష్టానికి పూర్తిగా కేసీఆర్‌నే బాధ్యుడని వ్యాఖ్యానించారు. కృష్ణా నదీ జలాల పంపకాల్లో - మిగతా 2 లో

## బంగ్లాదేశ్‌లో తారిఖ్ రెహమాన్ తొలి ప్రసంగం




- హదీ ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ కోసం కలలు కన్నాడన్న తారిఖ్ రెహమాన్
- అతడి కల కోసం తమ పార్టీ పని చేస్తుందన్న తారిఖ్
- మెరుగైన బంగ్లాదేశ్ నిర్మాణానికి తన వద్ద ప్రణాళిక ఉందని వెల్లడి
- షేక్ హసీనా పాలనపై విమర్శలు

### భారీ ఎన్ కౌంటర్ పై

## అమిత్ షా స్పందన

- ఒడిశా ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టుల మృతి
- నక్సలిజం అంతానికి మరో కీలక అడుగు అన్న అమిత్ షా
- ఆపరేషన్లు మరింత తీవ్రతరమవుతాయని హెచ్చరిక



దేశంలో మావోయిస్టు కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వం మరింత దూకుడు పెంచింది. ఒడిశాలోని కంధమాల్ జిల్లా గుమ్మా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. ఇది నక్సలిజం అంతానికి మరో కీలక అడుగు అని వ్యాఖ్యానించారు. 2026 నాటికి దేశం మొత్తాన్ని నక్సలిజం నుంచి పూర్తిగా విముక్తం చేస్తామని తెలిపారు. ఒడిశాను మావోయిస్టు రహిత రాష్ట్రంగా - మిగతా 2 లో

## ఆర్టికల్ 370' రద్దు బీజేపీకి గర్వకారణం

- లఖ్‌నవూలో ప్రేరణస్థల్ ప్రారంభించిన ప్రధాని మోదీ
- శ్యామాప్రసాద్, దీన్‌దయాల్, వాజ్‌పేయీ విగ్రహాలతో ప్రేరణస్థల్
- భారతమాత విగ్రహానికి నివాళులర్పించిన ప్రధాని మోదీ



స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ అనుసరించిన విధానాలపై ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ మహనీయులను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. ఆర్టికల్ 370 గోడను కూల్చడం బీజేపీకి గర్వకారణమన్నారు. స్వాతంత్ర్యం తర్వాత జరిగిన మంచి పనులన్నీ ఒకే కుటుంబానికి ఆపాదించారని విమర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో రాష్ట్రీయ ప్రేరణస్థల్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసం గించారు. ఈ క్రమంలోనే దేశ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, క్రిస్మస్ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో ఆనందం నింపాలన్నారు. అటల్‌జీ హయాంలోనే గ్రామగ్రామాన రోడ్ల నిర్మాణానికి బీజం పడిందన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. - మిగతా 2 లో

## సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ సీఎం





- పులివెందుల చర్చిలో జగన్ కుటుంబం ప్రత్యేక ప్రార్థనలు
- తల్లి విజయమ్మ, భార్య భారతితో కలిసి హాజరు
- చర్చి బయట వేచి ఉన్న అభిమానులకు అభివాదం, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ చీఫ్

## దేశం మెచ్చే నాయకుడు వాజ్‌పేయి

- మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని అమరావతిలో ఆయన విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



ఆర్థిక సంస్కరణల తర్వాత దేశ ప్రగతికి మాజీ ప్రధాని వాజ్‌పేయి తీవ్రంగా కృషి చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన చూపిన మార్గం సుపరిపాలన అని కొనియాడారు. దేశం మెచ్చే నాయకుడిగా చిరస్థాయిగా ప్రజల గుండెల్లో వాజ్‌పేయి నిలిచిపోయారన్నారు. చరిత్ర తిరగరాసే నాయకత్వం వాజ్‌పేయిది, నాకు ఎప్పుడూ స్ఫూర్తినిచ్చే నేత ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్, వాజ్‌పేయి ఇద్దరూ చాలా చనువుగా ఉండేవారని గుర్తు చేశారు. నేషనల్ ఫ్రంట్ ద్వారా యాంటీ కాంగ్రెస్‌కు ఎన్టీఆర్ బీజం - మిగతా 2 లో




ప్రజా మహాబలి

శుక్రవారం 26 - 12 - 2025

# సంపాదకీయం

## బంగ్లా బడబాగ్ని



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ ఢిల్లీ, కోల్‌కతాల్లో మంగళవారం భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఢిల్లీలో బంగ్లాదేశ్ హైకమిషన్ కార్యాలయం ముందు వందలాది నిరసనకారులు తమ ఆగ్రహాన్ని ప్రకటిస్తూ, ప్రతీ హిందూ రక్తపుబొట్టునూ లెక్కిస్తామని నినదించారు. కోల్‌కతాలో బీజేపీ అగ్రనాయకుడు సువేందు అధికారి సారథ్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. పరివార్ సంఘాల కార్యకర్తలు బంగ్లా దౌత్యకార్యాలయంవైపు వెళ్ళకుండా నిరోధించడానికి పోలీసులు లాఠీచార్జి చేయవలసి వచ్చింది. విజ్ఞాపనపత్రం సమర్పించిపోతామని హామీ ఇచ్చినా పోలీసులు తమపై దురుసుగా ప్రవర్తించారని బీజేపీ నాయకుల ఆరోపణ. మూకదాడి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన చంద్రదాస్ కుటుంబానికి ప్రతీ నెలా ఆర్థికసాయం అందచేయబోతున్నట్టు కూడా సువేందు అధికారి ప్రకటించారు. ఎన్నికలు ముగిసేవరకూ బంగ్లాదేశ్‌లో హింస తగ్గదని అక్కడి విశ్లేషకులు అంటుంటే, ఎన్నికలు సమీపిస్తున్న పశ్చిమబెంగాల్‌నూ సరిహద్దు ఆవలి పరిణామాలు ప్రభావితం చేయడం సహజం.బంగ్లాతో దౌత్యానికి సమయం దాటిపోయిందని, ఇక శస్త్రచికిత్స చేయాల్సిందేనని అసోం ముఖ్యమంత్రి హేమంత బిశ్వశర్మ అంటున్నారు. జాతీయ మీడియాతో ఆయన చేసిన ఈ వ్యాఖ్యల్లో అంతరార్థం పొరుగుదేశంవారికి అర్థంకాకపోదు. భారత్ వ్యతిరేకతమీదే ఆధారపడిన బంగ్లాదేశ్ రాజకీయజీవులకు ఇక్కడి మాటలు, చర్యలు ఆక్సిజన్‌లాగా ఉపకరిస్తాయి. మరో రెండునెలల్లో ఎన్నికలు జరగబోతున్న ఆ దేశంలో పరిస్థితులు అతివేగంగా దిగజారిపోతున్నాయి. హసీనా వ్యతిరేక ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన షరీఫ్ ఉస్మాన్ హదీ హత్యతో ఇటీవల రేగిన హింస పలురీతులుగా విస్తరించింది. గార్మెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న హిందూ యువకుడు దీపు చంద్రదాస్‌ను హత్యచేసి, తగలబెట్టేశారు. భారత్‌కు భజన చేస్తున్నాయనీ, హసీనా అనుకూల సంస్థలన్న ఆరోపణతో కొన్ని పత్రికలమీద దాడులు జరిగాయి. ప్రతీ క్షణం ప్రాణభయంతో, ఆత్మరక్షణలో బతుకుతున్నామని మీడియా ప్రముఖులు వాపోతున్నారు. చంద్రదాస్ మతదూషణకు పాల్పడ్డాడన్న వాదనలో వీసమెత్తు నిజం లేదని నిర్థారణ అయిపోయింది. అతడిని రక్షించే ప్రయత్నం చేయకుండా ఫ్యాక్టరీ బయటకు తోసివేసి భక్షకులకు అప్పగించడం వంటి పరిణామాలు తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి. షేక్ హసీనా అత్యంత అప్రజాస్వామికంగా, నిరంకుశంగా దేశాన్ని ఏలినమాట నిజం. ఆమెకు వ్యతిరేకంగా ఉద్యమించి, ప్రభుత్వాన్ని కూల్చి, చివరకు ఆమె దేశం విడిచిపోయేవరకూ జూలై తిరుగుబాటుదారులు విశ్రమించలేదు. విదేశాల్లో ఉన్న యూనిస్‌ను తాత్కాలిక అధినేతగా తెచ్చిపెట్టుకున్న ఈ విద్యార్థిలోకం దేశాన్ని చక్కగా గాడినపెట్టుకొని, ప్రజాస్వామికంగా తీర్చిదిద్దుకుంటుందని అంతా అనుకున్నారు. కానీ, షేక్ ముజిబూర్ రహ్మాన్ మూలాలను చెరిపివేయడం మీద ఉన్న శ్రద్ధ పరిస్థితులను చక్కదిద్దుకోవడం మీద లేకపోయింది. అవామీలీగ్‌ను ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధించడంతోపాటు, ప్రత్యేకకోర్టు తీర్పుతో హసీనాను తిరిగి దేశంలోకి అడుగుపెట్టనివ్వకుండా జాగ్రత్తపడ్డారు. మరోపక్క ఆమె ప్రత్యర్థి ఖలేదాజియాను స్వదేశానికి రప్పించి, రాబోయే ఎన్నికల్లో ఆమె పార్టీ విజయానికి ద్వారాలు తెరిచారు. జమాతే ఇస్లామీ సహా వివిధ మతసంస్థలమీద ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్ళలో ఉన్న ఆయా శక్తులను యూనిస్ ప్రభుత్వం వీధుల్లోకి వదిలేసిన ఫలితమే ప్రస్తుత అగ్గి. భారత్ వ్యతిరేకత ఆధారంగా ఎన్నికల్లో ఎక్కువస్థానాలు నెగ్గాలని కొన్ని పక్షాలు ప్రయత్నిస్తుంటే, మతవిద్వేషాలు రేపి పైచేయి సాధించాలని ఇస్లామిక్ శక్తులు చూస్తున్నాయి. పొరుగుదేశంలో అతివేగంగా మారుతున్న పరిణామాలకు జమాతే వంటి ఇస్లామిక్ సంస్థలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణం. యాభైమూడుశాతం ఓటర్లు వీటిపక్షాన ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి. ఆరునూరైనా ఫిబ్రవరి 12నే ఎన్నికలు నిర్వహిస్తామని యూనిస్ గట్టిగా చెబుతున్నారు. అనుకున్నట్టు జరుగుతాయా లేదా అన్నకంటే అప్పటివరకూ దేశం ఎంత హింస చవిచూడాల్సి వస్తుందన్నది ప్రశ్న. పొరుగుదేశం పరిణామాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. హసీనాకోసం ఆ దేశాన్నే వదులుకున్నామన్న విమర్శలను అటుంచితే, అక్కడి ప్రమాదకర పరిణామాలపై అదుపులేని వ్యాఖ్యలు చేయడం, వారిని అవమానించేట్టుగా, రెచ్చగొట్టేట్టుగా మాట్లాడటం మనకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు.

# దేశం మెచ్చే నాయకుడు వాజ్‌పేయి

**మొదటిపేజీ తరువాయి –** వేశారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలను ప్రారంభించిన పీవీ నరసింహారావు మన తెలుగుబిడ్డ అన్నారు. ఆర్థిక సంస్కరణల తర్వాత దేశ ప్రగతికి వాజ్‌పేయి తీవ్రంగా కృషి చేశారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. నేడు అటల్ బిహారీ వాజ్ పేయ్ 101వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఘన నివాళులర్పించారు. అమరావతిలోని వెంకటపాలెంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి 13 అడుగుల కాంస్య విగ్రహాన్ని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి చంద్రబాబు ఆవిష్కరించారు.విగ్రహం వద్ద చంద్రబాబు, శివరాజ్‌సింగ్ చౌహాన్ మొక్కలు నాటారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను పరిశీలించారు. మంగళగిరి వస్త్రాల ప్రత్యేకతలను చేనేతలు అక్కడి నేతలకు వివరించారు. అనంతరం నేతలు వాజ్‌పేయి ప్రస్థానంపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కేంద్రమంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్, సత్యకుమార్ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సుపరిపాలన సభలో సీఎం మాట్లాడారు. పాలనకు కొత్త దిశ చూపిన మహానేత : రాజకీయాల్లో అజేయమైన అధ్యాయం అటల్ బిహారీ వాజ్‌పేయి అని చంద్రబాబు అన్నారు. తన పేరుకు తగినట్టే దేశ సేవలో అచంచల సంకల్పంతో నిలిచిన నాయకుడని కొనియాడారు. రాజనీతిజ్ఞుడిగా అరుదైన గౌరవం, కవిగా హృదయానికి చేరువయ్యే భావప్రకటనలు, సమ్మతి నిర్మాణంలో అపూర్వ నైపుణ్యం అటల్ జీ ప్రత్యేకతలుగా పేర్కొన్నారు. దేశ భద్రతను బలోపేతం చేసి, పాలనకు కొత్త దిశ చూపిన మహానేత అని అన్నారు. అయనతో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కడం అదృష్టమని సీఎం అన్నారు. ఆయన జ్ఞానం, వినయం, నిష్కల్మషమైన విలువలు తరతరాలకు మార్గదర్శకమన్నారు. అటల్ జీ మాటలు, కార్యాచరణలతో అనేక తరాలను ప్రేరేపించారని తెలిపారు. దేశ అభివృద్ధికి ఆయన చేసిన మార్గదర్శక, పరివర్తనాత్మక సేవలు చిరస్మరణీయమని చంద్రబాబు కొనియాడారు. 26 జిల్లా కేంద్రాల్లో వాజ్‌పేయి విగ్రహాలు : "ప్రజా రాజధాని అమరావతిలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించాం. అమరావతి ప్రాంత రైతులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. రైతులు ముందుకొచ్చి 33 వేల ఎకరాలు రాజధానికి ఇచ్చారు. రైతులు భూములు ఇచ్చినందునే ఇవాళ అన్ని కార్యక్రమాలు చేస్తున్నాం. భారతదేశం గర్వించే నాయకుడు, అరుదైన నేత వాజ్‌పేయి. ఈనెల 11 నుంచి అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ప్రారంభించారు. 26 జిల్లా కేంద్రాల్లో వాజ్‌పేయి విగ్రహాలు పెట్టాలని కోరారు. అందరూ కలిసి పనిచేసి ఒక చరిత్ర సృష్టించారు. అమరావతిలో వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నాం. వాజ్‌పేయి చేసిన పనులు శాశ్వతంగా ప్రజలకు గుర్తుండేలా స్మృతివనం ఏర్పాటు చేస్తాం. మోదీ ఆధ్వర్యంలో డిసెంబర్ 25న గుడ్ గవర్నెన్స్ డేగా నిర్వహించుకుంటున్నాం" అని చంద్రబాబు తెలిపారు. ఫోన్ విషయం మాట్లాడితే ఎగతాళి చేసేవారు : "ప్రపంచంలోనే భారతీయులు ప్రథమ స్థానంలో ఉంటారు. భారతీయుల్లోనే తెలుగు జాతి ముందుండేలా కృషిచేస్తా. ఎప్పుడూ ప్రజల మనిషిగా నిరంతరం పనిచేసే వ్యక్తి శివరాజ్‌సింగ్ చౌహాన్. అరుదైన నాయకులతో పనిచేయడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఒకప్పుడు నేను ఫోన్ విషయం మాట్లాడితే చాలా మంది ఎగతాళి చేసేవారు. నాలెడ్జ్ ఎకానమీకి టెలికాం సెక్టార్ వెన్నెముకలాంటిది. ఆ రంగం అద్భుతాలు సృష్టిస్తూ ముందుకెళ్తోందంటే దానికి కారణం వాజ్‌పేయి. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు అణుపరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. అప్పుడు సైబరాబాద్, ఇప్పుడు అమరావతి. ఆరోజు హైటెక్ సిటీతో ప్రారంభమైంది. క్వాంటం వ్యాలీతో అమరావతి ప్రారంభమవుతోంది. అప్పుడు హైటెక్ స్పీడ్, ఇప్పుడు క్వాంటం స్పీడ్. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ వంటి అనేక అంశాల్లో మోదీ సహకరిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్నివిధాలా సహాయం చేస్తోంది. సంపద సృష్టించి ఉద్యోగాలు కల్పించాలంటే పీపీపీ విధానం మేలని చూశాం. ఒక ఎయిర్‌పోర్టు నిర్మించామంటే ప్రైవేటు వ్యక్తులది కాదు, వాళ్లు నిర్వహిస్తారు. 20 లేదా 30 ఏళ్లు నిర్వహించి మళ్లీ ప్రభుత్వానికి అప్పగిస్తారు" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కాలేజీలు పెట్టినవాళ్లను జైళ్లో పెడతానంటారా? : ఒకప్పుడు నాయకులు ఎంతో గౌరవంగా ఉండేవాళ్లని చంద్రబాబు అన్నారు. అధికారంలోకి వస్తే కాలేజీలు పెట్టినవాళ్లను జైళ్లో పెడతానంటారా? అని ప్రశ్నించారు. అభివృద్ధి చేసేవాళ్లను జైలులో పెడతారా? సరైన పద్ధతేనా? అని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొందరు చేస్తోన్న చిల్లర రాజకీయాలు చూస్తే బాధేస్తుంటుందన్నారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా పీపీపీ విధానం, అభివృద్ధి ఆగదన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇప్పించేలా ప్రయత్నాలు చేస్తున్నాం, ఎన్టీఆర్‌కు తప్పకుండా భారతరత్న తెచ్చేలా కృషిచేస్తామని స్పష్టం చేశారు. "అబ్దుల్ కలాం, వాజ్‌పేయి లాంటి నాయకులు స్ఫూర్తిగా నిలిచారు. కొంతమంది నాయకులు దేశం కోసమే ఆలోచిస్తారు. కొంతమంది నాయకులు స్వార్థం కోసం ఆలోచిస్తూ ఉంటారు. దేశం మెచ్చే నాయకుడు వాజ్‌పేయి, భారతీయుల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వాజ్‌పేయి చూపించిన మార్గం సుపరిపాలన. ఆనాడు వాజ్‌పేయి, ఎన్టీఆర్ దేశం కోసం ఆలోచించారు. ఇప్పుడు నరేంద్రమోదీ దేశం కోసం ఆలోచించారు. నేను నా తెలుగుజాతి కోసం ఆలోచిస్తున్నా. దేశాన్ని ప్రథమస్థానంలో నిలబెట్టేందుకు మోదీ కృషిచేస్తున్నారు. నేను తెలుగు రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలబెట్టే బాధ్యత తీసుకుంటాను." – సీఎం చంద్రబాబు సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న నాయకుడు : పార్టీలు, ప్రభుత్వాలు కాదు దేశమే ప్రథమమన్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. 1971లో భారత్-పాక్ యుద్ధం సమయంలో ఇందిరాగాంధీ ప్రభుత్వానికి బలమైన మద్దతుగా నిలబడ్డారని గుర్తు చేశారు. ఇప్పటి ప్రతిపక్షం ఆపరేషన్ సింధూర్ సమయంలో దేశం వెన్నంటి ఉండాల్సింది పోయి మోదీ లక్ష్యంగా విమర్శలు చేస్తూ దేశాన్ని బలహీనపరిచే చర్యలకు పాల్పడిందని ఆక్షేపించారు. 1998లో %చీణూ% ప్రభుత్వం ఏర్పడ్డాక వాజ్‌పేయి-చంద్రబాబు భాగస్వామ్యం దేశంలో అద్భుతాలు సృష్టించిందని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ గుర్తు చేశారు. ఇప్పుడు అలాంటి మోదీ-చంద్రబాబు మధ్య అలాంటి భాగస్వామ్యమే. దేశాన్ని ముందుకు నడుపుతోందన్నారు.

# రేవంత్‌రెడ్డి కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోడు

**మొదటిపేజీ తరువాయి –** తీసుకోకుండా ఎదురుదాడి చేస్తున్నారని జగదీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ లక్ష మందితో సభపెడితే కృష్ణ జలాలపై శాసనసభలో తీర్మానం చేశారని చెప్పారు. బనకచర్లపై కూడా అంతే నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఎదిరించి ఉద్యమం చేపడతామంటే దిగి వచ్చారని అన్నారు. కృష్ణా నదికి చంద్రబాబు గండి కొట్టే ప్రయత్నం చేస్తున్నడని, ఇరిగేషన్ మంత్రి అవగాహన లోపంతో, తెలివి తక్కువ తనంతో 40 టీఎంసీలకు ఒప్పుకొని ఉత్తరం రాసిండని చెప్పారు. 90 టీఎంసీల నీటిని మహబూబ్‌నగర్ రంగారెడ్డిలకు అందించేందుకు గతంలో 27 వేల కోట్లు ఖర్చుపెట్టామని, మిగిలిన పది శాతం పనులు పూర్తి చేయకుండా 40 టీఎంసీలకు ఒప్పుకుని మహబూబ్‌నగర్ రంగారెడ్డి జిల్లాలకు అన్యాయం చేసింద్రని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ గంటపాటు నీళ్లపై జరుగుతున్న అన్యాయాన్ని వివరించాడని, ఎవరిపై విమర్శ చేయలేదని చెప్పారు. చంద్రబాబు, నరేంద్ర మోదీ రాష్ట్రాన్ని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నరని ఆరోపించారు. మోదీ, చంద్రబాబులు రేవంత్‌రెడ్డి అవసరమని, ప్రజలకు అవసరం లేదని జగదీశ్‌రెడ్డి అన్నారు. మోదీ, చంద్రబాబుల కోసం ప్రజల గొంతు ఎండబెడతామంటే ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్.. ప్రభుత్వం తోలు తీస్తా అన్నారని, స్ట్రీట్ ఫెలోస్ గురించి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి తాము కూడా నోటికొచ్చినట్లు మాట్లాడగలమని, కానీ ఆ భాషను తాము మాట్లాడమని అన్నారు. రేవంత్ రెడ్డిది కంపు నోరని, మురికి కాలువ కంపు కంటే అధ్వాన్నమని విమర్శించారు. రేవంత్‌ది ఏ కోశాన కూడా కేసీఆర్ స్థాయి కాదని జగదీశ్‌రెడ్డి అన్నారు. రేవంత్ కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోడని, ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చే మాటలు మాట్లాడుతున్నడని విమర్శించారు. ముఖ్యమంత్రి సోయి తెచ్చుకొని మాట్లాడాలని, సాధారణ ఎన్నికలు వస్తే ప్రజలే రేవంత్ రెడ్డిని బండరాళ్లు కట్టి మున్సిపల్ చెత్త పారేసినట్లు మూసిలో పడవేస్తరని అన్నారు. కేసీఆర్‌కు సమాధానం చెప్పలేక బూతు మాటలు మాట్లాడుతుండని మండిపడ్డారు. కేసీఆర్ ప్రజల్లోకి వస్తుంటే భయం ఎందుకు..? దమ్ముంటే కేసీఆర్ ప్రశ్నకు సమాధానం చెప్పు అని సవాల్ చేశారు. నువ్వు, నీ పోలీసులు అధికారులతో ఎన్ని పన్నాగాలు పన్నినా టీఆర్ఎస్ సైనికులు అద్భుతమైన పోరాటంతో గెలుపొందారని జగదీశ్‌రెడ్డి అన్నారు. 'కేసీఆర్ నీ బండారం బయటపెడతాడని బూతులు మాట్లాడుతున్నవ్.. నువ్వు ఎంత దిగజారినా మేం ఆ స్థాయికి రాము' అని ఎద్దేవా చేశారు. దొంగ రాతలు రాస్తూ కుటుంబాలను ఇబ్బందులు పెడుతున్న మీకు ప్రజల చేతుల్లో శిక్ష పడుతుందని అన్నారు. రేవంత్‌రెడ్డీ కేసీఆర్ ముందు నీ కుప్పి గంతులు మానుకో అని హెచ్చరించారు.అమరావతి : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి పులివెందులలో సందడి



చేశారు. గురువారం ఉదయం స్థానిక సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ తన తల్లి వైఎస్ విజయమ్మ, భార్య వైఎస్ భారతి రెడ్డితో కలిసి చర్చికి చేరుకున్నారు. వారితో పాటు మరికొందరు కుటుంబ సభ్యులు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం జగన్ చర్చి వెలుపల వేచి ఉన్న అభిమానులు, స్థానికులకు అభివాదం చేస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. జగన్ పర్యటన సందర్భంగా పులివెందులకు వైసీపీ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చర్చి పరిసరాల్లో పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో కేసీఆర్ చెప్పాలి

**మొదటిపేజీ తరువాయి –** తెలంగాణకు రావాల్సిన వాటాను కేసీఆర్ తాకట్టు పెట్టారని బండి సంజయ్ ఆరోపించారు. "కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. 575 టీఎంసీల కోసం పోరాడాల్సిన సందర్భంలో కేసీఆర్ మౌనంగా ఉన్నారు. ముడుపుల కోసమే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారు" అని విమర్శించారు. ఈ విషయాలను ఆధారాలతో సహా బయట పెట్టింది తానేనని చెప్పారు. ఏపీ మాజీ సీఎం జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో ప్రజలకు కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పట్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిపించానని బండి సంజయ్ గుర్తు చేశారు. కృష్ణా జలాల అంశంలో కేసీఆర్ పాత్ర పూర్తిగా ద్రోహపూరితమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వెలుగులోకి వస్తున్న అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని లేవనెత్తుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం స్కాం నుంచి తప్పించుకునేందుకే కొత్త ఇష్యూ తీసుకొచ్చారని దుయ్యబట్టారు. కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణకు భారంగా మారిందని బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్ కుమారుడు కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారు. కేసీఆర్ కుటుంబమే తెలంగా ణకు పెద్ద శని. డబుల్ ఇంజిన్



సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం" అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల్ని కూడా బండి సంజయ్ తప్పుబట్టారు. "ఎవరి మీద విమర్శలు చేసినా మాటల తీరులో సంయమనం ఉండాలి. రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష సరైనది కాదు. ఇలాంటి మాటలు చివరకు ఆయన్నే నష్టపరుస్తాయి" అని సూచించారు. హిందూ ధర్మం ప్రతి వ్యక్తి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటుందని తెలిపారు. గతంలో కేసీఆర్ అనుచితంగా మాట్లాడినప్పుడు తాము ఖండించామని, ఇప్పుడు సీఎం రేవంత్ కూడా తన మాటలపై పునరాలోచన చేసుకోవాలని సూచించారు.


## ఆర్టికల్ 370' రద్దు బీజేపీకి గర్వకారణం



**మొదటిపేజీ తరువాయి –** 2000 ఏడాది నుంచి గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామాల్లో 8 లక్షల కి.మీ మేర రోడ్ల నిర్మాణం జరిగాయని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలోనే దాదాపు 4 లక్షల కి.మీ మేర గ్రామాల్లో రోడ్ల నిర్మాణం జరిగిందని తెలిపారు. దేశంలో ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణం మరింత పుంజుకుందని, అటల్‌జీ హయాంలోనే దిల్లీలో మెట్రో ప్రారంభమైందని చెప్పారు. "శ్యామాప్రసాద్, దీన్‌దయాల్, వాజ్‌పేయి విగ్రహాలు గొప్ప స్ఫూర్తి ఇస్తాయి. డిసెంబర్ 25న ఇద్దరు మహనీయులు జన్మించారు. వాజ్‌పేయి, మదన్‌మోహన్ మాలవీయ భారత ఏకత్వానికి కృషి చేశారు. ప్రేరణస్థల్ ప్రజల ప్రతి అడుగు జాతి నిర్మాణం దిశగా ఉండాలనే సందేశం ఇస్తుంది. ప్రజలందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది. నేతల విగ్రహాలు ఎంత ఎత్తు ఉన్నాయో వాటి వల్ల కలిగే ప్రేరణ అంత కంటే గొప్పది. శ్యామాప్రసాద్, దీన్‌దయాల్ కలల సాకారానికి సంకల్పం తీసుకోవాలి. ప్రపంచం మొత్తం బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం చూసింది. బ్రహ్మోస్ క్షిపణులు లఖ్‌నవూలోనే తయారవుతున్నాయి. లఖ్‌నవూలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్ ఉంది. మొబైల్, ఇంటర్నెట్ వాడే దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. 11 ఏళ్లలో భారత్ మరో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా మారింది. మొబైల్ ఫోన్లు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఉత్తర్‌ప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది."

## భారీ ఎన్ కౌంటర్ పై అమిత్ షా స్పందన

**మొదటిపేజీ తరువాయి –** మార్చడమే లక్ష్యమని చెప్పారు. భద్రతా బలగాల ఆపరేషన్లు మరింత తీవ్రతరం అవుతాయని స్పష్టం చేశారు. ఈ ఉదయం కంధమాల్ జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నమ్మకమైన సమాచారం భద్రతా బలగాలకు అందింది. వెంటనే



అప్రమత్తమైన పోలీసులు, ప్రత్యేక బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ సమయంలో మావోయిస్టులు కాల్పులకు దిగడంతో రెండు వర్గాల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. కొంతసేపు కొనసాగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఆ ప్రాంతం నుంచి భారీగా ఆయుధాలు, బుల్లెట్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో హతమైన వారిలో మావోయిస్టు ఉద్యమంలో అత్యంత కీలక నేతగా గుర్తింపు పొందిన పాక హనుమంతు అలియాస్ గణేశ్ కూడా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాయి. గణేశ్ స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూర్. ఆయనపై రూ.1.10 కోట్ల రివార్డు ఉంది. దాదాపు 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో కొనసాగుతూ, వివిధ కీలక హోదాల్లో పనిచేశారు. మావోయిస్టు సంస్థాగత విస్తరణలో గణేశ్ కీలక పాత్ర పోషించారని భద్రతా వర్గాలు చెబుతున్నాయి.

## బంగ్లాదేశ్‌లో తారిఖ్ రెహమాన్ తొలి ప్రసంగం



**మొదటిపేజీ తరువాయి –** ఇటీవల హత్యకు గురైన విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ కోసం కలలు కన్నాడని, అతడి కల కోసం తమ పార్టీ కృషి చేస్తుందని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ యాక్టింగ్ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ పేర్కొన్నారు. హాదీ ఇటీవల సింగపూర్‌లో చికిత్స పొందుతూ మరణించిన సంగతి విదితమే. ఆ తరువాత బంగ్లాదేశ్‌లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. హింస, నిరసనలతో అస్థిరంగా ఉన్న బంగ్లాదేశ్‌కు తారిఖ్ 17 సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చారు. బంగ్లాదేశ్‌కు చేరుకున్న అనంతరం పార్టీ మద్దతుదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, మెరుగైన బంగ్లాదేశ్‌ను నిర్మించేందుకు తన వద్ద ఒక ప్రణాళిక ఉందని తెలిపారు. ఆ ప్రణాళికను అందరూ కలిసికట్టుగా నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. 1971లో ఒకసారి, 2024లో మరోసారి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నామని ఆయన అన్నారు. మెరుగైన బంగ్లాదేశ్ నిర్మాణం కోసం, శాంతి కోసం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అవిశ్రాంతంగా పని చేస్తుందని హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్ అభివృద్ధి ప్రయాణంలో అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని తారిఖ్ పేర్కొన్నారు. మాజీ ప్రధాని షేక్ హసీనా పాలనపై ఆయన విమర్శలు గుప్పించారు. ఆమె పాలనలో ఎవరూ స్వేచ్ఛగా మాట్లాడలేకపోయారని ఆరోపించారు. తన తల్లి ఖలీదా జియా అనారోగ్యం గురించి ప్రస్తావిస్తూ, తన మనసంతా ఆమె వద్దనే ఉందని అన్నారు. కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం ఆయన తల్లిని చూసేందుకు ఆసుపత్రికి వెళ్లారు.

## వాజ్‌పేయి ప్రసంగాలు, వ్యక్తిత్వం యువతకు మార్గదర్శకాలు

**మొదటిపేజీ తరువాయి –** దేశ యువతకు అటల్ జీ జీవితం ఒక స్ఫూర్తి అనితెలిపారు. నేడు వాజ్‌పేయికు యావత్ దేశం ఘనంగా నివాళి అర్పిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## తిరుమలకు పోటెత్తిన భక్తులు.. శ్రీవారి సర్వదర్శనానికి 30గంటలు



**మొదటిపేజీ తరువాయి –** శ్రీవారి సేవకులు నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నారు. క్యూలైన్‌ల పరిస్థితిని ఎప్పటికప్పుడు తితిదే అధికారులు పర్యవేక్షిస్తున్నారు. క్యూలైన్లన్నీ నిండిపోవడంతో యాత్రికుల వసతి సముదాయంలో ఉంటూ శుక్రవారం ఉదయం సర్వదర్శనం క్యూలైన్‌లోకి రావాలని భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది. బుధవారం శ్రీవారిని 73,524 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.88 కోట్లు హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది. దీంతో భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, శ్రీవారి ఆలయం, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సాధారణ షెడ్లలో సేద తీరుతున్నారు. మరికొన్ని రోజులు ఈ రద్దీ కొనసాగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద సర్వదర్శనం (ఎస్?ఎస్?డీ) టోకెన్ల కోసం రద్దీ నెలకొంది. కోటా పూర్తికావడంతో అధిక సంఖ్యలో భక్తులు టోకెన్ల కోసం ఒక్కసారిగా ఎగబడటంతో విధుల్లో ఉన్న పోలీసు, తితిదే సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై పరిస్థితి అదుపు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. టోకెన్ల కోటా పూర్తయిందని తితిదే సిబ్బంది ప్రకటించడంతో.. భక్తులు తిరుమలకు పయనమయ్యారు. మరో వైపు తిరుమలకు వెళ్లేందుకు భక్తులు సొంత వాహనాల్లో తరలి రావటంతో అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాల రద్దీ అమాంతం పెరిగిపోయింది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తుండటంతో వాహనాల తనిఖీకి కొంత సమయం పడుతోంది. అలిపిరి ముఖద్వారం వరకు వాహనాలు బారులు తీరడంతో రద్దీని నియంత్రిస్తున్నారు.

# ఎడ్లబండ్ల జాతరకు ఏర్పాట్లేవి?

**15 రోజుల్లో సంక్రాంతి సంబరాలు**

**కలెక్టర్ ఆదేశాలిచ్చిన కదలని అధికార యంత్రాంగం**

**కొత్తపల్లి నుంచి 100 ఎడ్లబండ్లు భద్రత ఎవరి బాధ్యత?**



**భీమదేవరపల్లి, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** మండలంలో సంప్రదాయంగా నిర్వహించే మకర సంక్రాంతి ఎడ్లబండ్ల జాతరకు ఇంకా సరైన ఏర్పాట్లు కనిపించక పోవడంతో భక్తుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సంక్రాంతి పండుగకు కేవలం 15 రోజులు మాత్రమే మిగిలి ఉండగా, జాతర నిర్వహణకు సంబంధించి అధికారులు ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చరిత్ర ప్రకారం సంక్రాంతి రోజున ఎడ్లబండ్లు ఊరేగింపుగా తిరగడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి సంవత్సరం మండలంలోని ఒక్క కొత్తపల్లి గ్రామం నుంచి సుమారు 100 ఎడ్లబండ్లు ఈ జాతరలో పాల్గొని భక్తులకు కనువిందు చేస్తుంటాయి. ఇంకా వివిధ గ్రామాలకు చెందిన వందలకు పైగా ఎడ్లబండ్లు వస్తాయి. అయితే, ఈసారి ఎడ్లబండ్లు తిరిగే ప్రధాన రహదారి గుంతలు గుంతలుగా మారి అధ్వాన్న స్థితిలో ఉండటంతో ప్రమాదాల భయం నెలకొంది. గతంలోనూ ఇలాంటి పరిస్థితుల్లో బండ్లు బోల్తా పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు





గుర్తుచేస్తున్నారు. జాతరకు లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో, రోడ్ల మరమ్మత్తులు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు అత్యవసరమని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అధికార యంత్రాంగం కదలని పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి, రహదారి మరమ్మత్తులు తక్షణమే పూర్తి చేసి, సంప్రదాయ ఎడ్లబండ్ల జాతరను భద్రంగా, వైభవంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. లేదంటే సంక్రాంతి సంబరాలు అపసవ్యంగా మారే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

# నేత్రదాత సళ్ళా సంజీవ్ కుమార్ సంస్మరణ సభ

**నిర్వహించిన కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్.**

**జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపిన మాజీ కార్పొరేటర్ మిర్యాల్కర్ దేవేందర్**

**హనుమకొండ, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** నేత్రదాత సళ్ళా సంజీవ్ కుమార్ సంస్మరణ సభను వారి నివాసం హన్మకొండ లోని లష్కర్ బజార్ లో కుటుంబ సభ్యులు, సదాశయ ఫౌండేషన్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు శంకర్ రావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. దీనికి అతిథులుగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ దళపతి పాల్గొని నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించడం జరిగింది. శరీర దాత కాళోజి గారి స్ఫూర్తితో ఏర్పడ్డ ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇప్పటికీ 160 పైన నేత్ర, 90 పైన అవయవ, 150



పైన శరీర దానాలను చేసి సమాజ హితానికి తోడ్పడడం జరిగిందని పేర్కొన్నారు. సదాశయ ఫౌండేషన్ అవయవ దానంలో ముఖ్య పాత్ర పోషించిన కారణంగా ఈ సంవత్సరం అవయవ దానంలో మన రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానం సాధించిందని అన్నారు. ఈ సంస్మరణ సభకు గౌరవ అతిథిగా మాజీ కార్పొరేటర్ మిర్యాల్కర్ దేవేందర్ పాల్గొని, నేత్రదానముతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన నేత్రదాత భార్య కళావతి, కుమారులు గిరీష్, వంశీలకు సహకరించిన అక్కలు బావలు సామ్రాజ్యం రాజవీరు, సావిత్రి బిక్షపతి, స్వరూప సత్యనారాయణ గార్లకు జ్ఞాపికను అందజేసి అభినందనలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపయోగపడే అవయవాలు శరీరం నేత్రాలు మరణానంతరం మట్టిలో వృధాగా పోనీయకుండా దానం చేసి మానవ మనుగడకు తోడ్పడాలని కోరారు. ఇట్టి బృహత్తర సేవను గత 18 సంవత్సరాలుగా సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు చేయడం గొప్ప విషయం అని ప్రశంసించినారు. చివరగా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి వందన సమర్పణ చేసి ముగించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన శేఖల్ల సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు 50 మంది నాయకులు

**జగిత్యాల జిల్లా, బుగ్గారం మండలం**



**జగిత్యాల డిసెంబర్ 25 (ప్రజా మంటలు) :** శేఖల్ల గ్రామానికి చెందిన సర్పంచ్ పర్సా రమేష్, ఉపసర్పంచ్ నార్ల బుచ్చయ్యతో పాటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన సుమారు 50 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు వారందరికీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసి శేఖల్ల గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన పర్సా రమేష్‌తో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులు కాంగ్రెస్ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం విశేషంగా మారింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సుభాష్, గ్రామ శాఖ అధ్యక్షుడు గాలిపెల్లి వెంకన్న, నంది తిరుపతి, సుధీర్ సింగ్, వార్డు మెంబర్లు నంది అంజలి, వెంకట్రామ్, పర్స గంగారాం, ఠాగూర్ ప్రశాంత్, అర్జున్, సాయి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన కొత్త నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, గ్రామాభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దావ వసంత్ సురేష్ - క్రైస్తవులకు శుభాకాంక్షలు



**జగిత్యాల డిసెంబర్ 25 (ప్రజా మంటలు) :** క్రిస్మస్ పండుగ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంప్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత్ సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చిలో కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దావ వసంత్ సురేష్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, కరుణ, సేవా భావానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో, పరస్పర ప్రేమాభిమానాలతో జీవించాలని యేసుక్రీస్తు సందేశం తెలియజేస్తుందని అన్నారు. సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయడమే నిజమైన క్రిస్మస్ ఆత్మ అని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించామని, ముఖ్యమంత్రి కేసీఆర్ గారు క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ గిఫ్ట్‌లు అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. క్రిస్మస్ పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరికీ క్రీస్తు ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనురాధ, వెంకటేశ్వర్ రావు, బాలే శంకర్, ఎలమాద్రి కిషోర్, గాజుల శ్రీనివాస్, గంగుపెల్లి వేణు, మాధవ్, రాగుల రాజు, పెండం గంగాధర్, సందకరి సురేష్, చెన్నీ నాగేష్‌తో పాటు పాస్టర్లు, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**సికింద్రాబాద్, డిసెంబర్ 25 (ప్రజా మంటలు) :** నగర పరిధిలో రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న సంచార జాతులు, నిరాశ్రయ కుటుంబాల చిన్నారులతో స్కై ఫౌండేషన్ గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా చిన్నారులకు బహుమతులు, ఆటవస్తువులు, వివిధ రకాల తినుబండారాలు అందజేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటవస్తువులు, బహుమతులు అందుకోవడంతో చిన్నారులు అపారమైన ఆనందం వ్యక్తం చేయగా, తమ పిల్లల్లో సంతోషం నింపినందుకు తల్లిదండ్రులు స్కై ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని పాల్గొన్నారు.

## టీడీఎఫ్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ శిబిరం




**సికింద్రాబాద్, డిసెంబర్ 25 (ప్రజా మంటలు) :** తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) వనిత చేయూత ప్రాజెక్ట్‌లో భాగంగా తూప్రాన్ మహిళల కోసం నూతన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ అందిస్తున్నట్లు టీడీఎఫ్ ఇండియా అధ్యక్షులు మట్ట రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. గత మార్చిలో 60 మందికి శిక్షణ ఇవ్వగా, అందులో 23 మంది ఉత్తీర్ణులై సర్టిఫికెట్లు పొందినట్లు వనిత చేయూత అధ్యక్షురాలు టి.వాణి చెప్పారు. వనిత చేయూత ప్రాజెక్ట్ ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యమని టీడీఎఫ్ అమెరికా మాజీ అధ్యక్షురాలు కవిత చల్లా, డాక్టర్ దినేష్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని వైస్ ప్రెసిడెంట్ పాటీ నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ ప్రాజెక్ట్ మేనేజర్ అమీనా భాను, టీడీఎఫ్ ఇండియా, అమెరికా సభ్యులు, తూప్రాన్ మహిళలు, విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దుబ్బుల కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణంరాజు



**భీమదేవరపల్లి, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** తెలంగాణ దుబ్బు కళాకారుల సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన డోకే కృష్ణంరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన సంఘ సభ్యుల సమక్షంలో ఈ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ, దుబ్బు కళాకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కళాకారులకు సంక్షేమ పథకాలు అందేలా పోరాటం చేస్తామని, సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. సంఘ అభివృద్ధి కోసం ప్రతి కళాకారుడు ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా, మండల నాయకులు, డోకె భీమయ్య, అనిల్, చందు, ఉడే తిరుపతి, రాజు పాల్గొన్నారు.

# రాత్రివేళ పశువుల అపహరణలు

**ముత్తారం రైతుల్లో భయాందోళనలు , ఒక్క రాత్రిలో జీవనాధారం మాయం**

**పోలీస్ గస్తీ పెంచాలని వినతి**



**భీమదేవరపల్లి, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** మండలంలో పశువుల దొంగతనాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన రైతు ఏనుగు సత్తిరెడ్డికి చెందిన పాలు ఇచ్చే గేదెను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఉదయం లేచి చూడగా పశువు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఇది మొదటిసారి కాదని గ్రామస్తులు తెలిపారు. గతంలో ఇదే ముత్తారం గ్రామానికి చెందిన కాశిరెడ్డి రాంరెడ్డికి చెందిన ఆవులు కూడా దొంగతనానికి గురయ్యాయని గుర్తుచేశారు. అలాగే అంతకుముందు హవల్దార్‌పల్లి గ్రామంలో కూడా పలు రైతులకు చెందిన పాడి పశువులు అపహరణకు గురికావడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. పాడి పశువులపైనే జీవనాధారం ఉన్న చిన్న, మధ్య తరహా రైతులకు ఇలాంటి దొంగతనాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఒక పశువు పోతే నెలల తరబడి ఆదాయం కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, దొంగలను వెంటనే పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## రోడ్డు ప్రమాదంలో గాయపడిన న్యాయవాది తాండ్ర సురేందర్ ను పరామర్శించిన మంత్రి లక్ష్మణ్ కుమార్





**గొల్లపల్లి డిసెంబర్ 25 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం లోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండ్ర సురేందర్, తండ్రి సత్తయ్య పంతులు భార్య జయ, హైదరాబాద్ వెళు న్న క్రమంలో ఫాజిల్ నగర్ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది ముగ్గురి కి గాయాలు కావడంతో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం హాస్పిటల్‌కు చేరుకుని సురేందర్ ను పరామర్శించి వైద్యులను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మంత్రి వెంటగొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, గుట్టలపల్లి సర్పంచ్ ఓరగంటి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## అటల్ బీహారీ వాజ్‌పేయి 101వ జయంతి వేడుకలు



**భీమదేవరపల్లి, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** జాతీయ సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద భారత మాజీ ప్రధాని, భారతరత్న, రాజనీతిజ్ఞుడు అటల్ బీహారీ వాజ్‌పేయి 101వ జన్మ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి, కేకు కట్ చేసి, ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మండల బీజేపీ అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, వాజ్‌పేయి ఆదర్శప్రాయమైన నాయకత్వం, సుపరిపాలన పట్ల ఆయన అనుసరించిన విధానంను సుపరిపాలన దినోత్సవంగా జరుపుకోవడానికి ప్రేరణగా నిలిచాయని అన్నారు. అలాగే, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ దిశగా ముందుకు సాగుతోందని, వాజ్‌పేయి దార్శనికతను కొనసాగిస్తూ ప్రజాహిత పాలనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, బీజేపీ సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, చిదురాల రమేష్, గండు సారయ్య, జిల్లా నాయకులు దొంగల వేణు, రఘు నాయకుల ప్రదీప్ రెడ్డి, బొజ్జపురి పృథ్వీరాజ్, ములుగు సంపత్, కాలేరు వికాస్, బొల్లంపల్లి శ్యామ్, సింగం రాజేందర్, దొంగల రాణా ప్రతాప్, తాళ్లపల్లి కుమార్, మాడుగుల అజిత్, చొప్పరి నవీన్, మధుకర్, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలపై గళమెత్తిన తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్



**హనుమకొండ, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనిటీ అధ్యక్షులు కరేటి శంకరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు సీతారాములు మాట్లాడుతూ, పెన్షనర్లకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పెన్షనర్లకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు జారీ చేసి వైద్య సేవలను సులభతరం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య, టీచర్స్ కాలనీ అధ్యక్షులు రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొని పెన్షనర్ల సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. దాదాపు 60 మంది పెన్షనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

# ప్రమాదంలో యువకుడి మృతి

**నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించిన కుటుంబం**



**ఎల్కతుర్తి, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన చందుపట్ల విద్యాసాగర్ (24) ప్రమాదంలో మృతి చెందగా, గుండె నిండా బాధ ఉన్నప్పటికీ ఆయన కుటుంబ సభ్యులు చూపిన మానవీయత సమాజానికి ఆదర్శంగా నిలిచింది. కుమారుడి మరణానంతరం కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు వచ్చి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ మేరుగు భీష్మాచారికి ఫోన్ ద్వారా తెలియజేయగా, వెంటనే స్పందించిన ఫౌండేషన్ ప్రతినిధులు ఏర్పాట్లు చేపట్టారు. ఎల్ వి పి టెక్నీషియన్ లక్ష్మన్ (వరంగల్) సహకారంతో కార్నియాలను సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంక్ కు పంపించారు. ఇలా విద్యాసాగర్ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయంతో ఇద్దరు అంధులకు చూపు లభించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు చందుపట్ల అశోక్, శారద, అక్క బావలు జ్యోతి, రాకేశ్, వాణి, వినోద్, అలాగే సహకరించిన రమేష్, క్యాతం మల్లేశంలను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ మేరుగు భీష్మాచారి, వరంగల్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ దళపతి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు శంకర్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు వేణుమాధవ్ అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. యువకుడి మృతిలోనూ మానవత్వాన్ని చాటిన ఈ కుటుంబ నిర్ణయం సమాజంలో నేత్రదానంపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని పలువురు ప్రశంసించారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**గ్రామ ఐక్యతకు ప్రతీకగా క్రిస్మస్ వేడుకలు**



**భీమదేవరపల్లి, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** ముత్తారం గ్రామంలోని ఏసురత్నం ఎలిజబెత్ మెమోరియల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. పాస్టర్ ఎజ్రా, మాసిలామణి ఆహ్వానంతో గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొని వేడుకలకు శోభ చేకూర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి దంపతులు, ఉపసర్పంచ్ మాట్ల హరికుమార్, వార్డు సభ్యులు దైవ సేవకులను సన్మానించారు. జనవరి 1 న, దైవ కార్యక్రమానికి ప్రేమ విందు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్ నిర్వహించారు. ఇదే సందర్భంగా ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గ్రామంలోని వివిధ చర్చిలను సందర్శించి, క్రైస్తవ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. మతాల మధ్య ఐక్యత, శాంతి భావన మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల గోపి, గుడికందుల బాలరాజు, గద్వాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంజినీరింగ్ ఫీజులు సవరించిన ప్రభుత్వం

**ఆ కళాశాలల్లో పెరిగిన రుసుములు**

**న్యాయస్థానం ఆదేశాలతో 2023-26 మూడేళ్ల కాలపరిమితికి ఈ మార్పు**

**2026-27 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి కొత్త ఫీజులు**

**2023లో నిర్ణయించిన ఫీజులనే వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**




రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యాసంస్థలు ఫీజుల మోత మోగిస్తున్నాయి. పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. అయినా సరే పిల్లల్ని మంచి కళాశాలలో చదివించాలనే ఉద్దేశంతో చాలామంది తల్లిదండ్రులు ఇంజినీరింగ్ సీటుకు ఫీజు ఎక్కువ ఉన్నా చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాలతో 2023-26 మూడేళ్ల కాలపరిమితికి ఈ మార్పు చేసింది. దీని ప్రకారం కనీస ఫీజు రూ.40,000 కాగా, గరిష్ఠంగా రూ.1.05 లక్షలు. ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ 2023లో కళాశాలలకు 3 ఏళ్ల కాలానికి ఫీజులను నిర్ణయించింది. దీనిపై కొన్ని యాజమాన్యాలు అప్పట్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల మేరకు అప్పట్లో కమిషన్ ఫీజులను 10 శాతం పెంచింది. తరువాత కమిషన్ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు 31 కళాశాలలు తమ ఆదాయ, వ్యయాల నివేదికలను కమిషన్‌కు సమర్పించగా వాటిని ఆడిట్ చేసి, ఫీజులను నిర్ణయించింది. వీటిలో 7 కళాశాలల ఫీజులు పెరిగాయి. 192 కళాశాలలు కమిషన్‌కు నివేదికలు సమర్పించలేదు. దీంతో ఆ ఏడు కళాశాలలు మినహా మిగతా అన్నింటికీ 2023లో నిర్ణయించిన ఫీజులనే వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి గడువు ఈ ఏడాదితో పూర్తి అవుతుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త ఫీజులు అమల్లోకి రానున్నాయి. మరోవైపు గత కొన్ని నెలల కిందట ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల ఫీజుల ఖరారు చేసేందుకు గరిష్ఠ పరిమితులతో కూడిన శ్లాబ్‌లు నిర్ణయించే అధికారం ఉన్నత విద్యా కమిషన్‌కు ఉండదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2023-26 మధ్యకాలానికి కళాశాల ఫీజు నిర్ధారణ కోసం గార్డెనింగ్, చట్టపరమైన ఖర్చులు, సెమినార్లు, వర్క్?షాప్?లు, ప్రకటనల పై ఉన్నత విద్యా కమిషన్ గరిష్ఠ పరిమితిని విధించింది. ఆ నిర్ణయాన్ని ఏపీ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం హైకోర్టులో సవాల్ చేసింది. ఇంజినీరింగ్ కాలేజీలకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్)లు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు వేసింది. సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది పరమేశ్వర్ వాదిస్తూ, శ్లాబ్?లను నిర్ణయించే అధికారం కమిషన్‌కు ఉందని సుదీర్ఘ వాదనలు వినిపించారు. దీనిపై విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ పీకే మిశ్రలతో కూడిన ధర్మాసనం ఉన్నత విద్యా కమిషన్ వాదనలతో విభేదించింది. పిటిషన్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. 'కాలేజీలే ఫీజులు నిర్ధారించాల్సింది ఉన్నత విద్యా కమిషన్ కాదు. ట్యూషన్, హాస్టల్, ల్యాబ్‌లు, స్పోర్ట్స్ రుసుముల వివరాలను అవి కమిషన్ దృష్టికి తెస్తాయి. కాలేజీలు అందిస్తున్న సేవలకు తగ్గట్టుగా ఫీజులు ఉన్నాయా? లేదా? అని మాత్రమే కమిషన్ పరిశీలించాలి. ఆ ఫీజులు డొనేషన్ల తరహాలో ఉండకుండా చూడటం వరకే మీ బాధ్యత అని స్పష్టత ఇచ్చింది. అంతే తప్ప మీరే ఖరారు చేయకూడదు. విద్యార్థుల నుంచి ఎంత వసూలు చేయాలనే విషయాన్ని ఫీజు ఖరారు కమిటీ నిర్ణయిస్తే విద్యా సంస్థల స్వతంత్రత ఏమవుతుంది?' అని ధర్మాసనం ప్రశ్నించింది.

# మీ ఫోన్ పోయిందా - పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు చేయొచ్చు

**కేంద్రం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ www.ceir.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు**

**వాట్సప్ నంబరు 9121102266 ద్వారా పోలీసులకు సమాచారం**

**ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సిమ్‌కార్డు బ్లాక్ చేయించాలంటున్న పోలీసులు**




ప్రస్తుతం చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ప్రతి వ్యక్తి జీవితం సెల్‌ఫోన్ చుట్టూనే తిరుగుతోంది. సెల్‌ఫోన్ మన జీవితంలో ఒక భాగమైపోయింది. వాటిలో వ్యక్తిగత సమాచారంతో పాటు విలువైన సమాచారాన్ని కూడా భద్రపరచుకుంటాం. అలాంటి ఫోన్? చోరీకి గురైనప్పుడు కొందరు మానసిక ఒత్తిడికి గురవుతారు. అందులో ఉన్న సమాచారం ఎక్కడ బయటపడుతుందోనని తీవ్ర ఆందోళన చెందుతుంటారు. అలాగే ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్‌లో బ్యాంకు లావాదేవీలు, వ్యక్తిగత వివరాలు, వాహన పత్రాలను భద్రపరచుకుంటున్నారు. అంత విలువైన ఫోన్ ఒక్క నిమిషం కనిపించకుండాపోతే ఉక్కిరిబిక్కిరే అవుతారు. ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న, చోరీకి గురైన 342 ఫోన్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు గుర్తించారు. వాటిని ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు చేతుల మీదుగా యజమానులకు అప్పగించారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పోగొట్టుకున్న ఫోన్లను, చోరీకి గురైన వాటిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత మూడు నెలలుగా అయిదు విడతల్లో రూ.50 లక్షల విలువైన ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. వాటిని బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. "ఒకవేళ మీ ఫోన్ ఎవరికైనా దొరికితే వారు దానిని ఉపయోగించి నేరాలకు పాల్పడే ప్రమాదముంది, కాబట్టి ప్రజలు ఫోన్లను పోగొట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫోన్? భద్రత మాత్రం యజమానిదే". ఫిర్యాదు చేయండిలా: ఎక్కడైనా, ఎవరైనా సెల్?ఫోన్? పోగొట్టుకుంటే బాధితులు పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ %ఙఙఙ.ఎవఱతీ.స్త్రశీఙ.ఱఅ% వెబ్‌సైట్‌లో %శ్రీశీర్ ఎశీఎఱశ్రీవ% అనే ఆప్షన్ ద్వారా ఫోన్ బిల్, ఐడీ ప్రూఫ్, ఐఎంఈఐ వివరాలు నమోదు చేసి ఫిర్యాదు నమోదు చేయవచ్చునన్నారు. పోలీసు వాట్సాప్ నంబరు 9121102266కు సంప్రదించాలని సూచించారు.

**జాగ్రత్తలు తప్పనిసరి :**

ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సిమ్‌కార్డును బ్లాక్ చేయించాలి.

బ్యాంకుకు అనుసంధానంగా ఉన్న నంబరును మార్చుకోవాలి.

ఎవరైనా అనుమానాస్పదంగా సెల్‌ఫోన్లు అమ్మడానికి ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలి.

సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనుగోలు చేయాల్సి వస్తే తప్పనిసరిగా సక్రమమైన రసీదును పరిశీలించి తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలి.

ఇక చోరీకి గురైతే చెప్పక్కరలేదు: ఇప్పటి నుంచి ఫోన్ చోరీకి గురైతే పోలీస్ స్టేషన్?కు వెళ్లి ఫిర్యాదు చేసే అవసరం లేకుండా 9121102266 నంబరును సంప్రదిస్తే సరిపోతుందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. చివరికి ఫోన్‌ను గుర్తించి ఆ తరువాత బాధితులకు సమాచారం అందించి అప్పగిస్తామని వెల్లడించారు. చౌర్యానికి గురైన సెల్‌ఫోన్లను తిరిగి రాబట్టడంలో అనంతపురం జిల్లా పోలీసులు ముందంజలో ఉన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన చాట్ బాట్ సాఫ్ట్?వేర్ సహాయంతో పోలీసులు చౌర్యానికి గురైన సెల్‌ఫోన్లను పలు దఫాలుగా రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఫోన్ చౌర్యానికి గురైనా పోలీసులకు సమాచారం ఇస్తే చాలు, సెల్ ఫోన్ ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా అట్టే పట్టేస్తున్నారు. తాజాగా అనంతపురం జిల్లాలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులని పిలిచి జిల్లా ఎస్పీ జగదీష్ తిరిగి వారికి అప్పగించారు. ఎస్పీగా జగదీష్ బాధ్యతలు చేపట్టాక సెల్ ఫోన్ దొంగలపై కూడా ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. సెల్ ఫోన్లు దొంగలించడమే పనిగా పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేయడానికి ప్రత్యేకంగా పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. తొలిసారిగా దొంగిలించిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి మొదటి తప్పుగా వదిలేస్తున్నారు. రెండోసారి దొంగతనం కేసులో పట్టుపడితే కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే ఇలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయడానికి ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఛాట్ బాట్ సహాయంతో ఇప్పటి వరకు 25 కోట్ల రూపాయల విలువైన సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామని జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. పూర్తి వార్త కోసం ఇక్కడ క్లిక్? చేయండి.

# చిన్నారుల కోసం ఓ స్పెషల్ అంబులెన్స్ ఉందని తెలుసా

**సేవలు ఉపయోగించుకోండిలా!**

**సత్ఫలితాలిస్తున్న నియోనటాల్ అంబులెన్సుల సేవలు**

**నవజాత శిశువుల మరణాల నివారణే లక్ష్యంగా కార్యచరణ**

**వరంగల్ జిల్లాలో రెండేళ్లలో 2,271 మందికి సేవలు**

**24 గంటలూ అందుబాటులో ఉంటున్న సిబ్బంది**




ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియోనాటల్ అంబులెన్సులు శిశువుల పాలిట సంజీవనిలా మారాయి. అత్యాధునిక సౌకర్యాలు కలిగిన దీని సేవలు 2023 సెప్టెంబరులో అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేల సంఖ్యలో పసి పిల్లల ప్రాణాలను ఈ నియోనాటల్ అంబులెన్సులు కాపాడాయి. ఇలాంటి అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒకటి చొప్పున కేటాయించింది. ఈ వాహనం కోసం ఇద్దరు టెక్నీషియన్లు, ఇద్దరు పైలెట్లను నియమించారు. 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ అత్యవసర సమయాల్లో బాధితుల నుంచి ఫోన్ రాగానే క్షణాల్లో వెళ్లి సేవలందిస్తున్నారు. తద్వారా ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్నారు. ఈ ప్రత్యేకమైన వాహనంలో శిశువుల ప్రాణాలు కాపాడేందుకు కావాల్సినటువంటి ఆధునిక పరికరాలున్నాయి. దీనిలో డిఫిబ్లేటర్, అడ్వాన్స్‌డ్ వెంటిలేటర్, ఆక్సిజన్ సిలిండర్లు, మానిటర్, సిరంజి పంపు, సెక్షన్ ఆపరేటర్, వార్మర్, ఇన్ఫ్యూజన్ పంపు, అంబుబ్యాగ్, నాలుగు ఆక్సిజన్ సిలిండర్లు తదితర పరికరాలు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు మరికొన్ని అత్యాధునిక పరికరాలు కూడా ఉన్నాయి. ఏడాది వయసులోపున్న శిశువులకు ఈ అంబులెన్స్ సేవలు అందిస్తోంది. పిల్లలకు ఇంటి వద్ద అనారోగ్య సమస్యలు ఎదురైనా, ఆస్పత్రిలో ఉన్నా నియోనటాల్ అంబులెన్స్ సేవలను ఉపయోగించుకోవచ్చు. వరంగల్ జిల్లాలోని పలు ఆసుపత్రుల నుంచి ఎంజీఎంకు తరలిస్తున్నారు. అత్యవసరమైతే ఎంజీఎం నుంచి హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్‌కు పసి పిల్లలను తరలిస్తున్నారు. ప్రభుత్వం ఈ సేవలను ఉచితంగా అందిస్తోంది. ఈ అంబులెన్స్ సేవలను అందించేందుకు ప్రత్యేకంగా కొత్త స్వాతి, సదానందం, గణపతి, కిరణ్‌లను నియమించిందనట్లుగా 108 ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు శివకుమార్ వెల్లడించారు. ఈ రెండేళ్లలో 2,271 మంది శిశువులను అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలించినట్లుగా వివరించారు. ఎంజీఎం నుంచి హైదరాబాద్ నీలోఫర్ హాస్పిటల్‌కు 112 మందిని తీసుకెళ్లారు. జిల్లాలో 2025 డిసెంబరు వరకు 891 మంది సేవలు వినియోగించుకున్నారు.

**నియోనిటాల్ అంబులెన్స్‌లో ఉన్న పరికరాలు :**

మానిటర్ : బీపీ(రక్తపోటు), పల్స్, సాచిరేషన్, ఉష్ణోగ్రతను సూచిస్తుంది.

ఇన్ఫ్యూజన్ పంపు : శిశువుకు సెలైన్ పెట్టినప్పుడు నిమిషానికి, ఎన్ని చుక్కల సెలైన్ పైపు ద్వారా వెళ్లాలనేది ఇన్ఫ్యూజన్ పంపు చూస్తుంది.

వెంటిలేటర్ (అడ్వాన్స్‌డ్) : శిశువు శ్వాస తీసుకోలేని సమయంలో కృత్రిమంగా వెంటిలేటర్ ద్వారా శ్వాస అందిస్తూ హాస్పిటల్‌కు తరలిస్తారు.

వార్మర్ : శిశువును వెచ్చగా ఉంచేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుంది.

అడ్వాన్స్‌డ్ ఎక్స్‌టెండెడ్ డిఫిబ్లేటర్(ఏఈడీ) : సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసుసిటేషన్) చేసినా లాభం లేకపోతే అడ్వాన్స్‌డ్ ఎక్స్‌టెండెడ్ డిఫిబ్లేటర్(ఏఈడీ)తో షాక్ ఇచ్చి తిరిగి గుండె కొట్టుకునేవిధంగా చేయడానికి దీనిని ఉపయోగిస్తారు.

సెక్షన్ ఆపరేటర్ : ఫిట్స్ వచ్చిన సమయంలో నోట్లోని నురగను బయటకు తీసేందుకు, ఉమ్మనీరు మింగి శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న సమయంలో నోట్లోని నురగను బయటకు తీసేందుకు ఈ పరికరాన్ని వాడతారు.

**తరలింపులో ప్రత్యేకతలు :**

చిన్నారులను తరలింపు సమయంలో ఆక్సిజన్ సరఫరా, ఉష్ణోగ్రత నియంత్రణ, స్టెరైల్ వాతావరణాన్ని తప్పనిసరిగా కల్పిస్తారు. సాధారణ అంబులెన్సులో అయితే డ్రైవర్, సాధారణ ఎమర్జెన్సీ టెక్నీషియన్ మాత్రమే ఉంటారు. నియోనాటల్ అంబులెన్సులో శిశు సంరక్షణలో ప్రత్యేక తర్ఫీదు పొందిన నర్సులు లేదా పీడియాట్రిక్ సపోర్ట్ సిబ్బంది కూడా ఉండటం విశేషం. 45 రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ పొందిన టెక్నికల్ అసిస్టెంట్‌లను వీటి సేవల్లో వినియోగిస్తారు. నవజాత శిశువులకు కూడా ఈ నైపుణ్యం కలిగిన సాంకేతిక సహాయకులు సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసుసుటేషన్) చేసి ప్రాణాలను కాపాడిన సందర్భాలనేకం. 108 అంబులెన్సులో తరలింపు సమయంలో శిశువులు ఆక్సిజన్ లోపం, హైపోథర్మియా(చలి వల్ల శరీరం వేడి తగ్గిపోవడం) కారణంగా మృతి చెందే ప్రమాదం ఎక్కువ. అందువల్ల ఈ నియోనిటాల్ అంబులెన్సులో అవసరమైన వైద్య పర్యవేక్షణ, ఉష్ణోగ్రత నియంత్రణ, వెంటిలేషన్ అందించడం వల్ల శిశువు బతికే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని సిబ్బంది చెబుతున్నారు.

# ఈ రెండు గ్రామాలు సేమ్ టు సేమ్

**వీధుల నుంచి విగ్రహాల వరకూ అన్నింటా సారూప్యం**

**హైవేకు ఒకవైపు గుంలాపూర్, మరోవైపు వెంకటాపూర్**

**ఇళ్లు, స్కూళ్లు, ఆలయాలు.. అన్నీ ఒకేలా కనిపించడం విశేషం**



ఆ రెండు గ్రామాలు కవలల్లాగా ఒకేలా కనిపిస్తాయి. వీధుల నుంచి విగ్రహాల దాకా, భౌగోళికంగా చూసినా.. నిర్మాణాల పరంగా చూసినా దాదాపుగా ఒకేలా ఉంటాయి. ఆ రెండు ఊళ్లలో ఏ ఊళ్లోకి అడుగుపెట్టినా కొత్తవారు ఆశ్చర్యపోవడం ఖాయం.. అవే కరీంనగర్ జిల్లా కోరుట్ల మండలంలోని గుంలాపూర్, వెంకటాపూర్ గ్రామాలు. జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉండే ఈ గ్రామాల మధ్య ఉన్న ఈ సారూప్యతలు అటుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి. గుంలాపూర్ లో అడుగుపెట్టే వారికి అంబేద్కర్ విగ్రహం స్వాగతం పలుకుతుంది. కాస్త ముందుకు వెళితే పంచాయతీ ఆఫీసు, చెరువు, దాని ఒడ్డున ప్రభుత్వ పాఠశాల ఉన్నాయి. ఇదేవిధంగా వెంకటాపూర్ గ్రామంలోకి ప్రవేశించాక మహాత్మా గాంధీ విగ్రహం స్వాగతిస్తుంది. ఎడమ వైపు పంచాయతీ ఆఫీసు, దాని వెనకనున్న కాలనీ మీదుగా వెళ్తే చెరువు, దాని ఒడ్డున ప్రభుత్వ పాఠశాల ఉన్నాయి. రెండు గ్రామాల్లోనూ శివార్లలో రెండు గుట్టలు, వాటిపై శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు కనిపిస్తాయి. గుంలాపూర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా ఫిబ్రవరిలో భీష్మ ఏకాదశి సందర్భంగా వారం రోజులు ఉత్సవాలు జరుగుతాయి. వెంకటాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా కార్తికమాసంలో వారం రోజుల పాటు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. రెండేళ్ల కిందట వెంకటాపూర్ లో గ్రామ యువకులు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా.. తాజాగా గుంలాపూర్ యువకులు కూడా తమ గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గుంలాపూర్ లో 532 కుటుంబాలు ఉండగా.. జనాభా 1,775. వెంకటాపూర్‌లో 680 కుటుంబాలు, 2001 మంది జనాభా ఉన్నారు.

# ధర్మపురిలో దొంగల బీభత్సం

**అక్కపెల్లి రాజారాజేశ్వర స్వామి దేవస్థానంలో భారీ దొంగతనం**



**గొల్లపల్లి, డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** ధర్మపురి శివారులోని కమలాపూర్ రోడ్డుపై ఉన్న అక్కపెల్లి రాజారాజేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి భారీ దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలో స్వామివారికి అలంకరించిన సుమారు 2 కిలోల వెండి పానపట్టతో పాటు, అమ్మ వారికి అలంకరించిన 8 గ్రాముల వెండి ముఖ కవచంను దుండగులు దొంగలించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. మొత్తం దొంగతనానికి గురైన వెండి ఆభరణాల బరువు 2 కిలోలు 8 గ్రాములుగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డీఎస్పీ రఘుచందర్, సీఐ రామ్నర్సింహారెడ్డి, ఎస్సై మహేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఫింగర్ ప్రింట్స్ బృందం ఆధారాలను సేకరించగా, సీసీటీవీ ఫుటేజ్ సహా అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనతో ప్రాంతీయ భక్తుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఆలయాల భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు త్వరలోనే నిందితులను గుర్తించి పట్టుకుంటామని తెలిపారు.

# జగిత్యాల ఫోటోగ్రాఫర్స్ ప్రీమియర్ లీగ్

**2 ముగింపు వేడుకలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**జగిత్యాల డిసెంబర్ 25, (ప్రజా మంటలు) :** జగిత్యాల పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించిన జగిత్యాల జిల్లా ఫోటోగ్రాఫర్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ – సీజన్ 2 ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ విజేతలుగా నిలిచిన జట్లకు చెక్కులు, ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్లలో ఉన్న క్రీడాస్ఫూర్తి అభినందనీయమని, ఇలాంటి టోర్నమెంట్లు స్నేహభావాన్ని, ఆరోగ్యకరమైన పోటీని పెంపొందిస్తాయని అన్నారు. యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆడువాళ లక్ష్మణ్, బాల ముకుందం, రూరల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కట్ట రాజేందర్, లావుడ్యా సురేందర్ నాయక్, చిక్రం మారుతి, శ్రీనివాసరావు, గంగాధర్, హరీష్ తో పాటు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొని విజేతలను అభినందించారు. క్రీడా స్ఫూర్తితో సాగిన ఈ టోర్నమెంట్ ఫోటోగ్రాఫర్ సమాజంలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# రాయికల్‌లో క్రిస్మస్ వేడుకలు

**భేతని చర్చిలో కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**రాయికల్ డిసెంబర్ 25 (ప్రజా మంటలు) :** రాయికల్ పట్టణంలోని భేతని చర్చిలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని మతాలు, వర్గాలు ఐక్యతతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రకాష్ రాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు మోర హనుమండ్లు, గిరి నాగభూషణం, పాస్టర్ మోషే, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు గన్నె రాజిరెడ్డి, పడిగెల రవీందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గండ్ర రమాదేవి అచ్యుత రావు, మాజీ కో-అప్షన్ సభ్యులు మహేంద్ర బాబు, చంద్ర తేజ, ఇర్ఫాన్, రాజశేఖర్, సంజీవ్ రెడ్డి, తదితర క్రైస్తవ సోదరులు, నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



**ఏలకతుర్తి డిసెంబర్ 25 (ప్రజామంటలు) :** ఏలకతుర్తి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన కొమ్ముల అంజి (20) శుక్రవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం, ఇందిరానగర్ దాటాక మోడల్ స్కూల్ ఎదుట బైక్‌పై వెళ్తున్న అంజిని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. అంజి సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# సాహిత్య ప్రపంచంలో రెండు కొత్త పుస్తకాలు

**'పసునూరి పంచ్', 'కాగార్ రిపబ్లిక్' ఆవిష్కరణ**







**హైదరాబాద్, డిసెంబర్ 25 (ప్రజా మంటలు) :** తెలుగు సాహిత్యానికి మరింత సార్థకత చేకూర్చే రెండు ముఖ్యమైన రచనల ఆవిష్కరణ కార్యక్రమాలు హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో ఘనంగా జరిగాయి. ప్రముఖ రచయిత డా. పసునూరి రవీందర్ రచించిన 'పసునూరి పంచ్' కావ్యాన్ని ప్రముఖ విద్యావేత్త, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డా. గంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ సభకు డా. సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య సూర్యపల్లి సుజాత, రహమాన్, పాశం యాదగిరి, ఆచార్య శ్రవణ్ తదితరులు పాల్గొని గ్రంథ విశిష్టతను ప్రశంసించారు. అదే సమయంలో మరో సాహిత్య కార్యక్రమంగా 'కాగార్ రిపబ్లిక్' గ్రంథాన్ని గాయని సంధ్య ఆవిష్కరించారు. ఈ సభకు అరసవిల్లి కృష్ణ, గోవర్ధన్, భరద్వాజ అధ్యక్షత వహించి రచనలోని సామాజిక దృక్పథాన్ని విశ్లేషించారు. రెండు గ్రంథాలూ సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించే అంశాలతో పాఠకులను ఆలోచింపజేసే విధంగా ఉండటంతో సాహిత్య వర్గాల్లో విశేష ఆదరణ పొందాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com